## వరుణ దేవుడా కరుణించు

14,500 ఎకరాల్లో అప్పుచేసి మక్క సాగు చేశాం

వర్షాలు లేక పంట ఎండిపోతోంది

లేమామిడి హనుమాన్ దేవాలయంలో రైతుల పూజలు

3

## రంగారెడ్డి ఎత్తిపోతల ఎప్పుడు?

నిర్మాణ పనులు ప్రారంభించకపోతే పోరాటం చేద్దాం

చౌదరిగూడలో సిపిఐ నేతల పిలుపు

4

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్



వార్త

## సమాజాన్ని మార్చే శక్తి మీకే ఉంది

పక్షపాతం లేకుండా వాస్తవాలు బయటకు తీయండి

కేవలం ప్రతికూల వార్తలే కాదు

పాజిటివ్ కథనాలతోనూ సమాజంలో మార్పు తేవచ్చు

మీడియా వర్క్‌షాప్‌లో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి హితవు

3



# వ్యవ'సాయం' లేదా?



**సిఎం ఇలాకాలో వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం**

**1000 ఎకరాల రైతులకు అందని రైతు భరోసా**

**క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే భూముల వివరాలు నమోదు**

**5వేల ఎకరాల భూముల మ్యాప్ లేదంటున్న సిబ్బంది**

**కంప్యూటర్‌లో భూ సమాచారం నమోదు కాలేదని వాదన**

**గుర్తున్న పేర్లను మాత్రమే భరోసా పథకం కింద తీసుకున్నామని వెల్లడి**

**అధికారుల ఉదాసీనతపై అన్నదాతల నిరసన**

**ఆందోళనకు సమాయత్తం**

**కొడంగల్, జూలై 15 ప్రభాతవార్త :** ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలే అన్న చందంగా ఉంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 1000 ఎకరాల్లో రైతు భరోసా జమకాక పోవడంతో కర్షకులు బోదిబోమంటున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు చేతపట్టుకొని నెల రోజులుగా ఇటు వ్యవసాయ శాఖ అధికారులు అటు రెవెన్యూ, కడా కార్యాలయం చుట్టు తిరుగుతున్నా రైతుల కాళ్ళ చెప్పులు అరుగుతున్నాయి తప్ప వారి ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. రైతు భరోసాకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతుల పొలాల్లో సాగు చేస్తున్న పంటలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, కాగా కొడంగల్ వ్యవసాయ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు మాత్రం ఉన్నతాధికారుల అండదండలతో పొలాల్లో ఎలాంటి పర్యటనలు చేయకుండానే పంటలను పరిశీలించకుండానే కార్యాలయంలోనే కూర్చుని రైతు భరోసా పేర్లను నమోదు చేయడం గమనార్హం. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా కొడంగల్ మున్సిపల్ పరిధిలో 441 మంది రైతులకు గాను 750 ఎకరాలకు సంభందించి రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు పడలేదు. అలాగే రావులపల్లి గ్రామంలో 76 మంది రైతులు, పర్సాపూర్‌లో 6గురు రైతులు, అంగడిరైచూర్ గ్రామంలో 130 మంది రైతులకు గాను సుమారు 160 ఎకరాలు, టేకుల్‌కోడ్‌లో 7 గురు, రుద్రారం గ్రామంలో 21 మంది రైతులకు రైతు భరోసా డబ్బులు అందలేదని రైతులు వాపోతున్నారు. కాగా కొడంగల్ భూముల మ్యాప్ లేక కంప్యూటర్‌లో రైతుల పొలాలు, సమగ్ర భూ వివరాలు జమచేయడం లేదని ఓ అధికారి తెలిపారు. సుమారు 5వేల ఎకరాలకు సంభందించి మ్యాప్ లేదని, అందులో తమకు గుర్తున్న పేర్లను మాత్రమే నమోదు చేశామని అధికారి చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ మిగతా 2లో





## సిఎం టూర్‌లో
# ముందస్తు అలర్ట్

**రోడ్డు విస్తరణ బాధితుల అరెస్టు**

**సిఎం పర్యటన అయ్యే వరకూ పోలీసుల అదుపులోనే**

**నష్ట పరిహారం విషయంలో తక్షణంలో స్పందిచాలని ఆందోళన కారుల డిమాండ్**

**శామీర్‌పేట, జూలై 15, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి నగరం నుంచి శామీర్‌పేట-తూంకుంట రాజీవ్ రహదారిన తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీలో జరిగే కార్యక్రమానికి వెళుతున్నందున ముందస్తుగానే పోలీసులు పలువురు బాధిత నాయకులను అరెస్ట్ చేసి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం శామీర్‌పేట మండలంలోని తూంకుంట గ్రామానికి చెందిన పలువురు రాజీవ్ రహదారి వెడల్పు నిర్మాణ పనులు ఎలివెటెడ్ కారిడార్ రోడ్డు ఏర్పాటులో పలువురు దుకాణ సముదాయాలు, భవనాలు, భూములు, ఆస్తులు రోడ్డు వెడల్పుతో కోల్పోతున్నందున బాధితులు ఆందోళన, ధర్నాలు చేయవచ్చన్న అనుమానంతో పోలీసులు ముందస్తుగానే పలువురిని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అరెస్టులు చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి శామీర్‌పేట మండలంలోని జీనోమ్‌వ్యాలీలో జరిగే కార్యక్రమంలో పాల్గొనటంతో తిరిగి నగరానికి వెళ్లిన తరువాత సాయంత్రం వదిలిపెట్టారని బాధితులు అన్నారు. రాజీవ్‌రహదారి రోడ్డు విస్తరణలో భూములు, ఆస్తులు కోల్పోతున్న బాధితులు కె.ఈశ్వర్‌గౌడ్, జి.కృష్ణారెడ్డిని, విద్యాసాగర్‌ను, సూర్యప్రకాశ్‌రెడ్డిని, నరేందర్‌గౌడ్, సోనారామ్, లింగంగౌడ్, శ్రీనివాస్, పలువురిని శామీర్‌పేట పోలీసుల సహకారంతో పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు వారి ఇళ్ల నుంచి అదుపులోకి తీసుకుని పిఎస్‌కు తరలించి తెల్లవారు జాము నుంచి సాయంత్రం 4గంటల వరకు పిఎస్‌లోనే ఉంచటం జరిగిందన్నారు. తమను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని పోలీసులను అడిగితే రాజీవ్ రహదారిన సిఎం కార్యక్రమం ఉన్నందున ఆటంకం చేస్తారనే ఉద్దేశంతోనే ముందస్తుగా అరెస్ట్‌లు చేస్తున్నామని తెలిపారని బాధితులు అన్నారు. ఈ విషయం తెలుసుకున్న జెఎసి చైర్మన్ తేలుకుంట సతీష్‌గుప్త వెంటనే పలువురు జెఎసి సభ్యులతో కలిసి పిఎస్‌లో అరెస్ట్ అయిన బాధితులను పరామర్శించటం జరిగిందని బాధితులు పేర్కొన్నారు. వెంటనే బాధితులను విడుదల చేయాలని కోరినప్పటికీ సిఎం ప్రోగ్రామ్ పూర్తి వరకు వీలుకాదని ఆ తరువాతనే వదిలిపెట్టటం జరుగుతుందని సిఐ పేర్కొన్నట్లు తెలిపారు. బాధితుల ముందస్థు అక్రమ అరెస్టలను ఖండిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు, బాధితులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు వెడల్పులో ఆస్తులు, భూములు కోల్పోతున్న వారికి న్యాయం మిగతా 2లో



బాత్‌రూమ్‌లను పరిశీలిస్తున్న దృశ్యం

# 'గురుకులానికి' కలెక్టర్ క్లాస్

**పాఠాల సిబ్బంది నిర్లక్ష్యంపై సీరియస్**

**విద్యార్థుల ఆందోళనకు స్పందించిన కలెక్టర్**

**హుటాహుటిన విద్యాసంస్థల తనిఖీ**

**మరుగుదొడ్లు, ఫ్యాన్ల రిపేర్లకు ఆదేశం**

**నిబంధనల ప్రకారం మెనూ ఉండాలని ఆదేశం**



పాఠశాలలో వంటగదిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

**శామీర్‌పేట, జూలై 15, ప్రభాతవార్త :** తుర్కపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల వెనకబడిన తరగతుల సంక్షేమ పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ మనుచౌదరి మంగళవారం సందర్శించారు. తమ సమస్యల పరిష్కారంలో పాఠశాల సిబ్బంది చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా విద్యార్థులు సోమవారం తరగతులు బహిష్కరించి గ్రామంలో ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే.. మా గోస వినరా? శీర్షికతో వార్తలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందిచారు. హుటాహుటిన పాఠశాలకు వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా కళాశాల, పాఠశాలలోని తరగతి గదులను, బాత్‌రూమ్‌లను, కిచెన్‌రూమ్‌లను పరిశీలించారు. ప్రాంగణం అంతా కలియతిరిగారు. ప్రిన్సిపల్, సంబంధిత వార్డెన్, ఇన్‌చార్జిలను, ఉపాధ్యాయులను, సిబ్బంది పనితీరుపై విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. యూనిఫామ్స్, నోట్‌బుక్స్, భోజనం తదితర విషయాలపై ప్రశ్నించారు. బోధన తీరుపైనా విద్యార్థులతో ముచ్చటించారు. వాటర్ ట్యాంక్ మరమ్మతుల వల్ల నీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని, మరుగుదొడ్లకు తలుపులు లేవని, నిద్రపోయే చోట ఫ్యాన్లు తిరగటంలేదని వాపోయారు. భోజనం సరిగా ఉండటంలేదని ఫిర్యాదు చేశారు. విద్యార్థుల సమస్యలు విన్న కలెక్టర్ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తంచేశారు. విద్యార్థుల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకురాలేదని నిగ్గదీశారు. తక్షణం నీటి ట్యాంక్‌ను వెంటనే మరమ్మతులు చేపట్టాలని, భోజనం, అల్పాహారం తయారు చేసే సమాగ్రి కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరుగు దొడ్లకు తలుపులు పెట్టించాలని సూచించారు. ఫ్యాన్స్‌లు వెంటనే మిగతా 2లో



మహిళలు బోనాలతో వెళుతున్న దృశ్యం

## దుద్యాల్‌లో బోనాల సందడి

**దుద్యాల్, జులై 15, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గ్రామ దేవత అయిన పోచమ్మకు మహిళలు సాంప్రదాయ వస్త్రాదరణలో ముస్తాబై అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనం అంటే భోజనం.. అని ఆషాఢ మాసంలో అమ్మవారు తన పుట్టింటికి వచ్చేటప్పుడు జాతర నిర్వహిస్తారని ఆనవాయితీ. గ్రామదేవతలకు భోజనం సమర్పించే సాంప్రదాయాన్ని బోనంగా పిలుస్తారు. బెల్లంతో చేసిన అన్నాన్ని కుండలో ఉంచి సున్నం, పసుపు, కుంకుమ, వేప కొమ్మలతో అలంకరించి ఆటపాటలతో డప్పుల చప్పుల్లతో గ్రామ వీధుల గుండా బయలుదేరి అమ్మవారి చెంతకు చేరుకొని మొక్కులు సమర్పించారు. మహిళలు, యువతులు సాంప్రదాయం ఉట్టిపడేలా బోనాల పండుగ జరుపుకున్నారు. సకాలంలో వర్షాలు కురవాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ అమ్మవారికి తమ మొక్కుల ు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువతులు, చిన్నారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పింఛన్లు పెంచే వరకు
# పోరాటం ఆగదు

**మహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**యంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ**



మాట్లాడుతున్న మందక్రిష్ణ మాదిగ

**పెద్దేముల్, జూలై 15, ప్రభాతవార్త :** అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లను పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని యంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ ఆరోపించారు. మంగళవారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లోని అంబెద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మందక్రిష్ణ మాట్లాడుతూ చేయూత (ఆసరా) పెన్షన్లను పెంచాలని తాము డిమాండ్ చేయడంలేదని, సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పెంచుతామన్న పెన్షన్లను ఎందుకు పెంచడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 19 నెలలు కావస్తున్న ఇంతవరకు పెన్షన్ల ఊసే ఎత్తడంలేదని విమర్శించారు. వికలాంగులకు, ఒంటరి మహిళలకు, వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ. 2 వేలు పెంచుతామని హమి ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలేదని అన్నారు. పెన్షన్ల పెంపు విషయంలో ప్రతిపక్షాలు కూడా మౌనం వహించడంలో అంతర్యమేమిటోనని ప్రశ్నించారు. నాటి నుంచి నేటి వరకు పేదల తరపున పెన్షన్ల కోసం అలుపెరుగని పోరాటం చేసింది యంఆర్‌పిఎస్సె నని గుర్తుచేశారు. పెన్షన్ల పెంపు కోసం రాష్ట్రంలోని మెజార్టీ నియోజకవర్గాలన్ని పర్యటిస్తానని అన్నారు. కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా ఈనెల 13న హైద్రాబాద్‌లో నిర్వహించే మహగర్జన కార్యక్రమాన్ని మిగతా 2లో





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

# నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదు

**జీరో ఎఫ్ఐఆర్ కేసుల్లో పురోగతి ఉండాల్సిందే**

**బాధితులకు సత్వర న్యాయం అందితేనే నమ్మకం ఉంటుంది**

**సమస్యాత్మక ప్రాంతాల్లో సిసిటివిల ఏర్పాటు వేగవంతంన**

**నిరంతరం వాహన తనిఖీలు జరగాలి**

**అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపండి**

**జిల్లా పోలీసులకు ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశం**

**వికారాబాద్, జులై 15, ప్రభాతవార్త :** జీరో ఎఫ్ఐఆర్ కేసులపై నిర్లక్ష్యం తగదని జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జీరో ఎఫ్ఐఆర్ కేసుల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో నమోదైన కేసుల వివరాల ు, ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. డిఎస్‌పి, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు.

దీంతో బాధితులకు సత్వర న్యాయం అందుతుందని, న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని ఆయన అన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో, ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీల ఏర్పాటు ు వేగవంతం చేయాలని సూచించారు. సీసీటీవీలు నేరాల నియంత్రణలో, నేరస్తుల ు గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన చెప్పారు. నిరంతరం వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని, తద్వారా రోడ్డు ప్రమాదాల ు తగ్గించవచ్చని తెలిపారు.

మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను పెంచాలని, వీటిని పూర్తిస్థాయిలో అరికట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు, ఆత్మహత్యలు జరగకుండా నివారించేందుకు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలతో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో 5 ఎస్ పద్ధతిని తప్పకుండా పాటించాలని, పరిశుభ్రత, క్రమశిక్షణతో కూడిన వాతావరణాన్ని నెలకొల్పాలని ఆదేశించారు. కేసుల వివరాల ు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఎటువంటి నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌లో ప్రతి ఫంక్షనల్ వెర్టికల్ పనితీరు గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.

డైల్ 100 ద్వారా వచ్చే ఫిర్యాదులపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని, బాధితులకు తక్షణ సహాయం అందించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీలు పి.వి.మురళీధర్, టి.వి.హ ుమంత్ రావు,తాండూర్, పరిగి, వికారాబాద్, ఏఆర్ డిఎస్పిలు తదితరులు పాల్గొన్నారు.

## నా పొలాన్ని కొల్లగొడుతున్నారయ్యా

**జెసిబిలతో తవ్వించి మట్టి తరలిస్తున్నారు**

**స్థానిక కాంగ్రెస్ నేత దౌర్జన్యంపై ఫిర్యాదు చేసినా**

**అధికారులు పట్టించుకోవటం లేదు- మీడియా సమావేశంలో బాధిత రైతు ఆవేదన**

**వికారాబాద్, జులై 15, ప్రభాతవార్త :** ధారూరు మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు రఘువీరారెడ్డి తమపై దౌర్జన్యానికి దిగు తున్నారని, తమ భూమిలో నుంచి అక్రమంగా మట్టి తరలింపు చర్యలకు పాల్పడు తున్నారని బాధిత రైతు ఖలీల్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ...తన స్వగ్రామం వికారాబాద్ మండలం సర్పన్‌పల్లి గ్రామం అని, ధారూర్ మండలం లోని అంతారం గ్రామంలో భూమి కొ నుగోలు చేశామన్నారు. అంతారం గ్రామంలో 29, 30, 31, 33 సర్వే నంబర్‌లో 23 ఎకరాల పొలాన్ని కొ నుగోలు చేశామన్నారు. ధారూరు మండలం.. అంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రఘు వీరారెడ్డి తమ పొలంలో అక్రమంగా జేసీబీలు పెట్టి తవ్వి రోడ్ల కోసం మట్టి తరలింపు చేస్తున్నారని ఆరోపించారు. అతనిపై ఎన్నో సార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో కలెక్టర్‌కు విన్నవించుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీలో ఉంటే ఏం చేసినా నడుస్తుందా అని నిలదీశారు. తమ భూమి జోలికి రాకుండా చూడాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను త్వరలోనే కలిసి వేడుకుంటానని తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పంధించి తమ భూమిలో అక్రమంగా మైనింగ్ చేస్తున్న రఘువీరా రెడ్డి పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## తాండూరులో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి హామీ

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హితవు

4

## తిలక్‌నగర్‌లో వైద్య శిభిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కాలేరు



తిలక్‌నగర్‌లో వైద్య శిభిరాన్ని ప్రారంభించిన కాలేరు వెంకటేశ్

**హైదరాబాద్, జులై 15 ప్రభాతవార్త:** కేర్ హాస్పటల్ సహకారంతో మంగళవారం నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్‌లో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఉచిత వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవలను అందించడమే ఈ ఆరోగ్య శిభిరం లక్ష్యమని చెప్పారు. ఈ శిభిరంలో వివిధ రంగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ నరేష్, డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొని రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, ప్రదీప్‌రావు, విజయ్‌సాగర్, శరత్, మూర్తి, నరే ంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు అధికారులను కలిసిన అసోసియేషన్ ప్రముఖులు


ఎస్ఎస్ఎస్‌పిడిఎస్ డైరెక్టర్‌లను కలిసిన తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

**చిక్కడపల్లి, జూలై 15 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ శాఖలో తెలంగాణ సథరన్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ (టిఎజిఎస్‌పిడిఎల్ డైరెక్టర్‌లుగా నియమితులైన డైరెక్టర్(ఫైనాన్స్) పి. క్రిష్ణ రెడ్డి, డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్.నరసింహులు, డైరెక్టర్ (ప్రాజెక్ట్) వి.శివాజీ, డైరెక్టర్(ఆపరేషన్స్) వి.చక్రపాణిలను మంగళవారం తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ మంగళవారం కలిసి ఘనంగా సత్కరించి అభినందించింది. కాంట్రాక్టర్ల అసోసియేషన్ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్తు లైసెన్స్ బోర్డు పూర్వ సభ్యుడు పి.సదానంద్ గౌడ్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ముఖ్యకార్యదర్శి ఎస్‌కె.మాజీద్, సంయుక్త కార్యదర్శి సంజయ్‌కుమార్, ముఖ్య సలహాదారు బిక్షమయ్య, ఫారిద్, ఎన్‌పిడిఎల్ అధ్యక్షుడు ఎస్‌కె. జలీల్, కొత్తగూడెం నుంచి ఈసాక్, కార్యనిర్వాహక కార్యదర్శి ఉపాధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ గౌడ్, వెంకట్ రెడ్డి, సురేష్, శంకరప్ప, మిర్యాలగూడ నుండి కిరణ్ కుమార్ రెడ్డి, గుండు శ్రీను, కార్యనిర్వాహక కార్యదర్శి యన్.పర్వతాలుతో పాటు వివిధ డివిజన్, సర్కిల్ నుండి భారీ ఎత్తున కాంట్రాక్టర్‌లు పాల్గొన్నారు.

## వ్యవ'సాయం' లేదా!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఇదిలావుండగా రైతు భరోసా పథకంపై ప్రభుత్వం ఎంతో అర్భాటాలతో అదరగొడుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు అన్యాయం జరుగుతుందని పలువురు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే రైతులకు న్యాయం జరుగకుంటే ఒక రాష్ట్రంలో రైతులకు ఎలా న్యాయం జరుగుతుందని చెప్పారు. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో పాటు రైతులకు న్యాయం కోసం త్వరలోనే రైతులతో కలిసి వ్యవసాయ కార్యాలం ఎదుట ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## సిఎం టూర్‌లో ముందస్తు అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతుందన్నారు. రాజీవ్‌రహదారిన చేపట్టే ఎలివెటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణంకు 100నుంచి 120ఫీట్ల రోడ్డు వెడల్పు సరిపోతుందని, అయితే ప్రభుత్వం 200ఫీట్ల రోడ్డు వెడల్పుకు విస్తరణ పనులు సిద్ధం చేయటం వల్ల బాధితులకు తీవ్ర నష్టం జరుగుతుందని వారు వాపోయారు. వంద ఫీట్ల వరకు కూడ రోడ్డులో భూములు, ఆస్తులు కోల్పోతున్న వారికి ఎంత నష్టపరిహారం ఇస్తారన్న విషయం స్పష్టత ఇవ్వటం లేదని అన్నారు. నష్టపరిహారం ఇచ్చే విషయంలో వెంటనే బాధితులతో సమావేశం ఏర్పాటు చేసి అధికారులు చర్చించాలని చర్చలకు రావటానికి సిద్ధంగ ఉన్నట్లు, బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నట్లు జెఎసి నాయకులు పేర్కొన్నారు.

## 'గురుకులానికి' కలెక్టర్ క్లాస్

(మొదటి పేజీ తరువాయి)

మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు కష్టంగా ఉన్న సబ్జెక్టుల మీద ఎక్కువగా శ్రద్ధ పెట్టాలని సూచించారు. క్రీడలు కూడ విద్యార్థులకు నిర్వహించాలన్నారు. వంటగదిని పరిశీలించి ఎప్పటికపుడు శుభ్రంగా పెట్టాలని దోమలు,ఈగలు రాకుండ శానిటేషన్ పక్కగా ఉండాలని, బియ్యం, కూరగాయలను బాగా కడగాలని, వంట తీరు పరిశుభ్రంగగా ఉండాలని కలెక్టర్ వారికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ప్రిన్సిపల్, హెడ్‌మాస్టర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పెంఛన్లు పెంచే వరకూ పోరాటం ఆగదు

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతం చేయాలని, అందుకు వికలాంగులకు, మహిళలకు, వృద్ధులకు, ఒంటరి మహిళలకు సబ్బండ వర్గాలు చేయూతనందించాలని పిలుపునిచ్చారు. పెన్షన్లను పెంచెవరకు యంఆర్‌పిఎస్ పక్షాన తమ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ప్రధానకార్యదర్శి ఉప్పరి రమేష్ కుమార్, నాయకులు బంటారం భద్రేశ్వర్, సందీప్‌కుమార్, యంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్. నాయకులు సుందర్, శ్రీనివాస్, కిరన్, కృప, నందు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూత

**నార్సింగి, జూలై 14 ప్రభాతవార్త :** గత దశాబ్దకాలంగా మణికొండ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి అనేక మంది పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం తన సొంత డబ్బులు వెచ్చిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతిభ ఉండీ కూడా పేదరికం కారణంగా ఉన్నత చదువులకు దూరం అవుతున్న వారిని గుర్తించి ప్రతీఏటా ఇంటర్, ఇంజనీరింగ్ విద్యార్థులను చదివిస్తూ మానవతావాదిగా మారారు.

ఈ సంవత్సరం జ్యోత్స్న అనే విద్యా ర్థిని ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయి 964.వ,ర్యాంకును సాధించి విఎన్ ఆర్ కళాశాలలో ఇంజనీరింగ్ సీటును పొందింది. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న రామకృష్ణారెడ్డి ఆ విద్యార్థిని వద్దకు వెళ్లి తక్షణ సాయంగా రూ.25.వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు గత పదేళ్ల నుంచి ఉడతా భక్తిగా నావంతు చేయూతనందిస్తున్నానని వివరించారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహకారం ఇవ్వడంలో ఎనలేని సంతృప్తిని కలుగుతుందన్నారు. సమాజంలో ఆర్థికంగా స్థిపడ్డ వారు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరింత మంది ముందుకు వచ్చి పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం అండగా నిలువాల్సిన అవసరం ఉందని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుద్ధోలు శ్రీరాములు, ఏర్పుల కుమార్, లక్ష్మీశ్రీ, శ్రవణ్ కుమార్, భానుచందర్ పాల్గొన్నారు.

## త్వరలో ఎస్సి, ఎస్టి దాడులపై సిఎం నేతృత్వంలో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

**సైఫాబాద్, జులై 15 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోజురోజుకు ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమ ంత్రి, ఇతర మంత్రులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య చెప్పారు. ఇందుకు స్పందించిన సిఎం త్వరలోనే ఒక సమావేశాన్ని ఏరా ్పటు చేసి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు దేవాలయాలతో సమానమని, దేశంలో కొన్ని పార్టీలు మతంపేరిట పాఠశాలల్లో దాడులు కొనసాగిస్తున్నాయని, వీటిని ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల స్థాయి వరకు దేశంలో ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్, ఎబివిపి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నాయని, దళిత, గిరిజన, ముస్లింలను టార్గెట్ చేస్తున్నాయని ఆరోపించారు. జై శ్రీరాం అనే నినాదంతో అలజడులు సృష్టిసు ్తన్నాయని చెపా ్రరు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా బూర్గుపల్లి ఉన్నత పాఠశాలలో మత ద్వేషాలను రెచ్చగొడుతూ గిరిజన టీచర్ నరేందర్‌నాయక్‌పై బిజెవైఎం దుండగులతో దాడి చేయించిన సోషల్ టీచర్ మనువాది రవిబాబును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బిజెవైఎం దుండగులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరారు. అలాగే కోటగిరి గ్రామంలో తెలుగు టీచర్ మల్లికార్జున్, తుక్కుగూడ ఉన్నత పాఠశాలలో రాములుపై దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత, గిరిజన నాయకులు వెంకటేష్‌చౌహన్, రాజేష్‌నాయక్, ఆశ శ్రీరాములు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## డా. బి.వి.పట్టాభిరామ్ వ్యక్తికాదు సామూహికశక్తి : డా. కె.వి.రమణాచారి


పట్టాభిరామ్‌కు నివాళులర్పిస్తున్న రమణాచారి, ప్రశాంత్, శ్రీనాథ్, వంశీరామరాజు, మల్లంరమేష్, జెన్నీ, రాజు తదితర ప్రముఖ కళాకారులు

**రవీంద్రభారతి, జులై 15 ప్రభాతవార్త :** విశ్వవిఖ్యాత సైకాలజిస్టు, మెజీషియన్ డా. బి.బి.పట్టాభిరామ్ ఒక వ్యక్తికాదు, సామూహిక శక్తి అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. పట్టాభిరామ్ చేపట్టిన కార్యక్రమాలను ఆయన కుటుంబసభ్యులు, శిష్యులు కొనసాగించాలని సూచించారు. మ్యాజిక్, మిమిక్రీ, మైమ్ కళాకారులు బి.వి.పట్టాభిరామ్ జ్ఞాపకాలను మననం చేసుకుంటూ తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో మిమిక్రీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, యువ తెలంగాణ మెజీషియన్స్ అసోసియేషన్, హైదరాబాద్ మెజీషియన్, తెలుగు మెజీషియన్స్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు జి.వి.ఎన్.రాజు అధ్యక్షతన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన పట్టాభిరామ్ సంస్మరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి పట్టాభిరామ్ చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పించి, రెండు నిముషాలు మౌనం పాటించి మాట్లాడారు. సైకాలజీ రంగాన్ని అత్యున్నతస్థాయికి తీసుకువెళ్లడంతోపాటు మ్యాజిక్, మిమిక్రి, మైమ్‌రంగాలను అనుసంధానం చేయడానికి డా. నేరెళ్ళ వేణుమాధవ్, డా. బి.వి.పట్టాభిరామ్‌లు సంయుక్తంగా తోడ్పాటు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ళ వేణుమాధవ్ కుమారుడు నేరెళ్ళ శ్రీనాథ్, పట్టాభిరామ్ కుమారుడు భావరాజు ప్రశాంత్, సీనియర్ పాత్రికేయుడు జ్వాలా నరసింహారావు, సాంస్కృతిక సంస్థల అధిపతులు వంశీరామరాజు, సత్కళాభారతి సత్యనారాయణ, సీనియర్ మెజీషన్‌లు వెంకటరమణ, విశ్వనాథ్ జోషి, డా. బి.ఎన్.ఎస్.కుమార్, అలీ, ప్రదీప్, రంగ్రేజ్, రామడుగు వసంత్, శ్రీరంగం, ప్రవీణ్, మిమిక్రీ అసోసియన్ అధ్యక్షుడు జి.వి.ఎన్.రాజు, నటుడు లోహిత్, మల్లం రమేష్, గజల్ వినోద్, రఘుబాబు, మైమ్ కళాకారులు జెన్నీ, మధు తదితరులు పాల్గొని పట్టాభిరామ్‌కు ఘననివాళులర్పించారు. చివరగా తమ తండ్రి ఆశయాన్ని ఆయన శిష్యుల సహకారంతో ముందుకు తీసుకువెళ్లానని కుమారుడు భావరాజు ప్రశాంత్ స్పష్టం చేశారు.

## కులమతాలకు అతీతంగా మున్నూరుకాపు వర్గం ముందుకు సాగాలి

### - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మున్నూరుకాపు ఓరియంటేషన్ శిక్షణ సదస్సులో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**శేరిలింగంపల్లి, జూలై 15 ప్రభాతవార్త :** కులమతాలకు అతీతంగా మున్నూరుకాపు సామాజిక వర్గం ముందుకు సాగితేనే రాజకీయ మనుగడ సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజకీయ పార్టీల తరహాలో మున్నూరు కాపులకు ఓరియంటేషన్ శిక్షణ తరగతులను నిర్వహించటం హర్షనీయమన్నారు. చందానగర్ లోని సుప్రజ గార్డెన్ స్‌లో మంగళవారం మున్నూరు కాపు సామాజిక వర్గ ఒక్కరోజు ఓరియంటేషన్ శిక్షణ తరగతుల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీల తరహాలోనే మున్నూరు కాపులు ఓరియంటేషన్ శిక్షణ తరగతను నిర్వహించటం శుభపరిణామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కూడా ఇలాంటి శిక్షణ తరగతులను నిర్వహించామన్నారు. మున్నూరు కాపుల నాయకత్వం గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. ఆత్మగౌరవ భవనం కోసం గత ప్రభుత్వం మంజూరు చేసిన 5కోట్ల రూపాయలు తిరిగి మున్నూరు కాపు భవనం నిర్మాణం కోసం వెచ్చించేలా కృషిచేస్తామన్నారు. అదే విధంగా మున్నూరు కాపులు పేరు చివరన పటేల్ అని వచ్చేలా గెజిట్‌ల నమోదు అయ్యేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పటం పురుషోత్తం రావు పటేల్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపుల సంక్షేమం కోసం సంఘం నిర్మాణం ఉంటుందన్నారు. వామ పక్షాలు తదితర పార్టీల తరహాలో మున్నూరు కాపులకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించటం మున్నూరుకాపు సంఘానికే గర్వకారణమన్నారు. టీఎస్పీసీసీ మాజీ సభ్యులు విటల్, జలమండలి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్, రౌతు కనకయ్య, మున్నూరు కాపుల విద్యావంతుల వేదిక రా ట్ర అధ్యక్షులు మల్లిఖార్జున్ ప్రబ్రుదులు ఓరియంటేషన్ శిక్షణ తరగతులలో వివిధ అంశాలపై బోధించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, అపెక్స్ కమిటీ సభ్యులు గాలి అనిల్‌కుమార్, మీసాల చంద్రయ్య, తూడి ప్రవీణ్, సంఘం రా ష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ బుక్క వేణుగోపాల్, డాక్టర్ జేఎన్ వెంకట్,చల్లా హరిశంకర్, మహిళా వింగ్ ప్రెసిడెంట్ బండి పద్మ, కోశాధికారి సత్యనారాయణ,ఉపాధ్యక్షులు వాసాల వెంకటేశ్వర్లు, రాష్ట్రంలోని ఆయా నియోజక వర్గ కో ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు,ప్రతినిదులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానందనగర్ బస్తి వాసులకు త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు : కార్పొరేటర్


ఆర్డీవోను సమావేశమైన గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, జూలై 15 ప్రభాతవార్త:** స్వామి వివేకానంద నగర్ బస్తి వాసులకు త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు పూర్తి చేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీ స్వామి వివేకానంద నగర్ బస్తి లోని 19 పేద దళిత కుటుంబాల ఇళ్లను గత ఏడాది ప్రభుత్వ అధికారులు నిర్ధాక్షి ణ్యంగా కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఏడాదిన్నరగా పేదలకు పునరావాసం కల్పించేందుకు ఆలస్యం ఎందుకు జరుగుతుందని స్థానిక కార్పొరేటర్ పావనీ వినయకుమార్ ఆర్డీఓ పి.సాయి రామ్‌ను ప్రశ్నించారు. మంగళవారం బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బస్తి వాసులతో కలిసి ఆర్ డి ఓతో సమావేశ య్యారు. ఇళ్ల కేటాయింపు కు కావలసిన వివరాలను, ఎంఆర్ఓ, ఆర్డిఓ, కలెక్టర్ కార్యాలయాలలో అందచేసి కూడా 15 నెలలు కావొస్తుందని, ఈ విషయంపై కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, ఎం.పి రాజ్యసభ డా"కె.లక్ష్మణ్, జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు బాధితులకు ఇళ్లు మంజూరు చేయాలని సూచించారని వివరిం చారు. ఇటీవల కలెక్టర్‌ను కలిసిన సందర్భంలో త్వరలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీ చేశామ న్నారని, నిరక్ష ్యం చేయకుండా వెంటనే బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూ లంగా స్పందించిన ఆర్ డి ఓ ఇళ్ల మంజూరు పూర్తి అయ్యిం దని, త్వరలో కుటుంబాల వారిగా కేటాయింపు ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. సమీక్షలో బస్తి వాసులు ఎం. బి.కృష్ణ, జ్ఞానేశ్వర్,ఆనంద్ రావు. తధిత రులు

## ముష్కిన్ చెరువులో మురుగు కలవడంపై హైడ్రా కమిషనర్ ఆగ్రహం

**- నిబంధనల మేరకే అందరూ నడుచుకోవాలని ఆదేశం**
**- మురుగునీరు ఎక్కడి నుంచి వస్తుందో ఏరియల్ సర్వే ద్వారా గుర్తిస్తాం**


మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ముష్కిన్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమీషనర్ రంగనాథ్

**నార్సింగి, జూలై 15 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ముష్కిన్ చెరువులో మురుగు నీరు కలువడంపై హైడ్రా కమీషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మణికొండ మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్, ఇరిగేషన్ అధికారులతో కలిసి రంగనాథ్ ముష్కిన్ చెరువును సందర్శించారు. ఈ చెరువులో అడ్డగోలుగా చెత్త, మట్టిని నింపుతున్నారని, డ్రైనేజి నీటిని చెరువులోకి మళ్లిస్తున్నారని హాల్‌మార్క్ విసినియా, మైహోమ్ అవతార్ గేటెడ్ కమ్యునిటీలకు చెందిన కొతమంది సోమవారం హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఓ స్వచ్ఛంద సంస్థ, ఓ నిర్మాణ సంస్థల ప్రతినిధులు కొన్ని రోజులుగా ముష్కిన్ చెరువులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టరని, అభివృద్ధి పేరుతో చెరువు పరిధిని తగ్గిస్తూ వస్తున్నారని కమీషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరి ఫిర్యాదు మేరకు మంగళవారం హైడ్రా కమీషనర్ ముష్కిన్ చెరువును సందర్శించి, అక్కడ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పనులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఏమి చేసినా నిబంధనలకు లోబడే చేయాలని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చట్ట పరిధిలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. 52.ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువులో కేవలం 12.ఎకరాలలోనే అభివృద్ధి ఎందుకు చేస్తున్నారని? ఈ చెరువులోకి మురుగు నీరు ఎందుకు కలుస్తుందని? ఇరిగేషన్ శాఖ అధికారులను నిలదీశారు. ఎవరైనా సరే ఇష్టానుసారంగా కట్టలు నిర్మిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ చెరువులోకి మురుగునీరు ఎక్కడి నుంచి వచ్చి చేరుతుందో ఏరియల్ సర్వే చేయించి, గుర్తిస్తామని, చెరువులోకి మురుగు నీరు రాకుండా చూస్తా మని రంగనాథ్ స్థానికులకు తెలిపారు. చెరువు ఎఫ్టీఎల్ లో పోసిన మట్టిని, ఆక్రమణలను త్వరలోనే తొలగిస్తామ ని హామీనిచ్చారు. చెరువు గేటు ముందు పోసిన మట్టిని వెంటనే తొలగించాలని, డ్రైనేజి నీరువులోకి రాకుండా పనులు ప్రారంభిస్తామని హైడ్రా కమీషనర్ రంగనాథ్ వివరించారు.

## లోకకళ్యాణార్థం 'పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగం'


'పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగం' కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

**హైదరాబాద్, జులై 15 ప్రభాతవార్త:** ధూపదీప నైవేద్య అర్చక సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని ఆకాంక్షిస్తూ లోకకళ్యాణార్థం 'పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగం' కార్యక్రమం మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కాచిగూడలోని తుల్జాభవన్ ధర్మశాలలో యాగ నిర్వాహకులు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా గణపతి పూజ, కర్మణ, పుణ్యాహవాచనం, మూలమంత్ర అనుష్ఠానములు, ప్రధాన మంటప దేవత హోమాలు, నవగ్రహ హోమం, రుద్ర, చండీ, కుబేర పాశుపత హోమం, సహస్రనామ పుష్పార్చన, నీరాజన మంత్రపుష్పం, బహుపరాకులు, చతుర్వే ఆశీర్వచనము, భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కోట నీలిమ, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎస్.వెంకట రావు,కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయ శర్మ, సంఘం గౌరవ సలహాదారు డాక్టర్ పోతులపాటి రామ లింగేశ్వర శర్మ,అధికార ప్రచార కార్యదర్శి కృష్ణ మాచార్యులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నిజాంపేట్, జూలై 15, ప్రభాతవార్త**

బౌరంపేట సబ్ స్టేషన్ నుండి ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 13:00 వరకు వెలువడే 11కేవీ కోకాకోలా ఫీడర్, 11కేవీ జున్రమ్ ఫీడర్లలో సింహపురి కాలనీ, నెక్స్ విల్లాస్, గోకుల్ బృందావన్, కె ఎల్ విశ్వవిద్యాలయం, డి ఆర్ కె ఇంజనీరింగ్ కళాశాల, డాలర్ డ్రీమ్స్, మై స్పేస్1, ఎస్బిఐ కాలనీ, సాయి కృష్ణ కాలనీ, రాయల్ విలేజ్, లహరి ఎస్టేట్, ఇందిరమ్మ కాలనీ బహదూర్ పల్లి ఎస్ఎస్ నుండి 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్‌లో ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 13:00 వరకు లక్ష్మీనగర్, సూరారం గ్రామం, విశ్వకర్మ కాల నీ, అయ్యప్ప సొసైటీ, సూరారం ప్రధాన రోడ్డు, సూరారం గ్రామం ప్రాంతాలు బౌరాంపేట ఎస్ఎస్ నుండి 11కేవీ కేవీఆర్ ఫీడర్ లో ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్ వుడ్ విల్లాలు, నేచర్ బౌంటీ విల్లాలు, స్టెర్లింగ్ హోమ్స్, జేఎన్ఎస్ విల్లాలు, శంబిపూర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని బౌరంపేట ఏఈబి సాయికిరణ్ ఒక ప్రకటనలో కోరారు.

**బాచుపల్లిలో..** 11 కేవీ సాయి నగర్ ఫీడర్‌లో నేడు ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 01:00 వరకు సాయి నగర్, రామ కృష్ణ ఎన్క్లేవ్, ఆర్జికే, ఆదిత్య గార్డెన్స్, డబుల్ బెడ్ రూములు అలాగే 11 కేవీ మా విల్లాస్ ఫీడర్ లో మధ్యాహ్నం 02:00 నుండి సాయంత్రం 05:00 వరకు మా విల్లాస్, గుల్మోహర్, కౌసల్య కాలనీ. ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

### - కార్పొరేటర్ అర్చన జయప్రకాష్




**అత్తాపూర్ జూలై15,ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛ రాజేంద్ర నగర్‌కు సహకరించాలని కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ ప్రత్యేక చర్యలు తీసుకొని పలు చోట్ల చెత్త డబ్బాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....కాలనీ వాసులు తమ చెత్తను ఇంటికి వచ్చే స్వచ్ఛ ఆటోలకు అందించాలని లేదా తమ కాలనీలో ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలో వేయాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ రోడ్డుపై చెత్తను పరివేయరాద్దని అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకునప్పుడే రోగాల బారిన పడకుండా ఉంటామని ఎవరైనా రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అందరూ స్వచ్ఛ రాజేంద్రనగర్ డివిజన్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రవీణ్ కుమార్,రాంకి సూపర్‌వైజర్ నర్సింహ రెడ్డి, జవాన్,బాబయ్య,శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో యువకుడి మృతదేహం లభ్యం

**కొంపల్లి, జూలై 15, ప్రభాతవార్త**

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ తురక చెరువులో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని బాచుపల్లి పోలీసులు, డిఆర్ఎఫ్ సిబ్బంది మంగళవారం ఉదయం స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాచుపల్లి పోలీసులు, డిఆర్ఎఫ్ సిబ్బంది కథనం ప్రకారం మంగళవారం ఉదయం సుమారు 8 గంటల ప్రాంతంలో 100 నెంబర్‌కి నిజాంపేట తురకచెరువు సమీపంలోని స్థానికులు ఫోన్ చేసి తురకచెరువులో గుర్తుతెలియని యువకుడి మృతదేహం తేలియాడుతూ కనిపిస్తుందంటూ సమాచారం అందించారు. దీంతో బాచుపల్లి పోలీసులు, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ ఎఫ్) సిబ్బంది సంఘటన స్థలమైన తురకచెరువుకు వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. మృతిచెందిన యువకుడికి సుమారు 30 నుండి 35 సంవత్సరాల వయసు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై నల్ల ప్యాంటు తెల్ల షర్టు ధరించి ఉన్నాడు. నల్ల రంగు చెప్పులను మృతుడు కలిగియున్నాడు. మృతదేహంపై ఎలాంటి దెబ్బలు గాని కత్తిపోట్లు గాని ఇతరత్రా అనుమానాస్పద గాయాలు ఏమీ లేవు. దీంతో మృతుడు ఆత్మహత్య కైనా పాల్పడి ఉంటాడని లేదంటే ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించి ఉంటాడని బాచుపల్లి పోలీసులు భావిస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిసి ఉంటే బాచుపల్లి పోలీసులకు గాని, 100 నంబర్‌కు గాని సమాచారం అందించాలని బాచుపల్లి పోలీసులు ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జిహెచ్ఎంసిలో ఘనంగా బోనాల ఉత్సవాలు


పూజల్లో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు

**హైదరాబాద్, జూలై 15 ,ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే బోనాల పండుగను పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నా రు. ఊరేగింపులో భాగంగా కట్ట మైసమ్మ తల్లిని దర్శించుకున్న మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మా ట్లాడుతూ... బోనాల పండుగ మన సంస్కృతిని, సమైక్యతను ప్రతిబింబిస్తుందని మున్సి పల్ ఉద్యోగుల భాగస్వామ్యంతో జరుపుకునే ఈ ఉత్సవం అందరికీ స్ఫూర్తిదాయకం" అన్నా రు. ఈ కార్యక్రమంలో పలువురు జీహెచ్ఎంసీ ఉద్యోగులు, అధికారులతో పాటు యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నృత్య గురువులకు జీవనోపాధి కల్పించాలి : అనూహ్య రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ అనూహ్యరెడ్డి, పిఎన్.మూర్తి, భూపతి వెంకటేశ్వర్లు తదితరులు

**చిక్కడపల్లి, జూలై 15 ప్రభాతవార్త:** నృత్య గురువుల నుంచి కూడా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహ కమిటీ సభ్యులుగా చేర్చాలని కోవిద ఆర్ట్స్,కల్చరల్ అకాడమీ అధ్యక్షురాలు డా: పి .అనూహ్య రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం, కోవిద ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన నృత్య గురువుల సమస్యలపై సమాలోచన సభాకార్యక్రమం తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డా: పి .అనూహ్య రెడ్డి మాట్లాడుతూ నృత్య గురువులకు భారత దేశం లో విశేషమైన స్థానం ఉందని, అటువంటి గురువులకు ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం సంక్షేమం లేదని అన్నారు. శాస్త్రీయ సంగీత నృత్య అకాడమీ ఎర్పాటు చేయాలని, తెలంగాణలో సాంస్కృతిక సచివాలయం కల్చరల్ సెక్రటేరియట్ ఏర్పాటు చేయాలని, తెలంగాణలో ప్రతి జిల్లాలో ఆడిటోరియల్ పునరుద్ధరించాలని, ప్రతి బడిలో ఒక నృత్య టీచర్ ఉండాలని కళాకారులకు కల్చరల్ కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవాలయాలు పర్యాటక శాఖలు సాంస్కృతిక కళాక్షేత్రాలు అన్నిట్లో నృత్య గురువులకు అవకాశాలు కల్పించాలని, నృత్య గురువులందరికి రవీంద్రభారతిలో అందరికీ అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని గురువుల తరపున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నృత్య గురువులు రమణి సిద్ధి ఇందిరా పరాశరం చిన్న జీయర్ స్వామి పవన్ డాన్స్ మాస్టారు తెలుగు వెలుగు శ్రీరామ్ దట్టి సీనియర్ జర్నలిస్టు సుమన్ సామాజికవేత్త సురేష్ గౌడ్ అనుదీప్తి ,హిందూమతి, రాధిక శ్రీనివాసులు, లావణ్య, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. కోవిద ఆర్ట్ అండ్ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షు రాలు అయిన అనూహ్యరెడ్డికి గౌరవంగా అభినందనలు తెలియజేశారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలి



**యూసుఫ్‌గూడ, జూలై 15, ప్రభాతవార్త :** ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల బస్తీల కాలనీలలో పాదయాత్రలు నిర్వహించి సమస్యలు తెలుసుకోవటం జరుగుతుందని జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అజారుద్దీన్ అన్నారు. మంగళవారం రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ బస్తీలో బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి పర్యటించారు. బస్తీలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలో ప్రజలు పలు సమస్యలతో సతమతమౌతున్నారని వాటన్నిం టిని త్వరగా పరిష్కరించి ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వ మని అన్ని వేళల ప్రజా సమక్షేమం కోసం కృషి చేయటం, ప్రభుత్వం తరపున పథకాలు అందేలా చూసే బాధ్యత ఉందన్నారు.

## ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన భర్త..

**జగద్గిరిగుట్ట, జూలై 15, ప్రభాతవార్త**

ఓ వ్యక్తి ఫుల్‌గా మద్యం సేవించి భార్యకు ఫోన్ చేసి నేను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జి.స్వప్న, నర్సయ్య (34) భార్యభర్తలు. వీరు జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం సుమారు 8 గంటల ప్రాంతంలో నర్సయ్య డ్యూటి కోసం వెళ్తున్నానని చెప్పి ద్విచక్ర వాహనం (టిఎస్07 ఈఈ3213)పై బయటికి వెళ్ళాడు. అయితే మధ్యాహ్నం సుమారు 1:15 గంటల ప్రాంతంలో స్వప్నకు ఫోన్ చేసి తిడుతూ, తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ కట్ చేశాడు. మళ్ళీ ఫోన్ చేయగా అతని ఫోన్ స్విచ్ఆఫ్ అని వస్తుంది. తెలిసిన వారిని, బంధువులను అడిగిన ఆచూకి లభించకపోవడంతో స్వప్న జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

**కీసర, జులై15, ప్రభాతవార్త:**
పరాసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం వంద రోజుల కార్యచరణ ప్రణాళికలోబాగంగాచీర్యాలసాయినగర్ కాలనీ ప్రజలకు డెంగ్యూ, మలేరియా, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా 600 వందల పూల మొక్కలు, పండ్ల మొక్కలు నాటామన్నారు. ఇంటింటికి పొడి, తడి వ్యర్థాలను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు వీధి, పెంపుడు కుక్కలపై ఏబిసి ప్రచారం జరుగుతుందన్నారు. చెత్త ఆటోలు వచ్చినప్పుడు చెత్తను అందులో వేయాలని రోడ్డకు ఇరువైపులా ఏవరైనా చెత్తను వేస్తే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. గృహ కంపోస్టింగ్ అవగాహన గృహ స్దాయిలో సేంద్రీయ వ్యర్దాలను కంపోస్టింగ్ చేయడంను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 683 మందికి బ్యాగులు, చెప్పులు, యోగామ్యాట్స్ నువంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో పాఠశాలలోఉన్నసౌకర్యాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఈఈ బాలమురళి, మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్స్ పెక్టర్ ప్రభు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మూడు గంటల పాటు విద్యుత్ కోత

**జూలై15, ప్రభాతవార్త:** ఈ నెల 16 వ తేదిన నారపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మూడుగంటలపాటు విద్యుత్‌కోత ఉంటుందని ఏఈవి. ప్రదీప్‌కుమార్ మంగళవారం నాడొక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ కోత ఉంటుందని వినియోగదారులు అధికారులకు సహకరించాల్సిందిగా కోరారు. విద్యుత్ స్టేషన్ పరిధిలోని వెంకటాద్రీటౌన్‌షిప్, చౌదరిగూడ, విజయపురి కాలనీ, శివాజీనగర్, ఓయూ కాలనీల్లోఉదయం పదిగంటల గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోచారం సంస్కృతి టౌన్‌షిప్ పరిధిలో సంస్కృతి టౌన్‌షిప్ బ్లాక్ డి2, డి3, డి4, సీ1, సీ2, సీ3, ఎ24 నుండి ఎ 35 వరకు బ్లాకుల్లో మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి ఐదు గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందుకు వినియోగదారులకు కల్గుతున్న అసౌకర్యానికి తాము చింతిస్తున్నామని వినియోగదారులు విద్యుత్‌అధికారులకు సహకారం అందించాల్సిందిగా కోరారు.

## ఎల్లమ్మని దర్శించుకున్న న్యాయవాదులు



**దుద్యాల్, జులై15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోలేపల్లి రేణుక ఎల్లమ్మతల్లిన్యాయవాదులుఆంజనేయులు, శివకుమార్, మన్నే బసవరాజులు దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం నాడు దేవస్థానం చైర్మన్ జయరాములుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సకాలంలో వర్షాలుకురవాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. తాండూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉద్దెర మల్లప్ప యాదవ్, వెంకట రాములు, శివకుమార్ పాటిల్, శ్రీనివాస్, భూషణ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా రోజారాణి

**బొంరాస్‌పేట్, జులై15, ప్రభాతవార్త:**



మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన ప్రభుత్వజూనియర్‌కళాశాలనూతన ప్రిన్సిపాల్ గా రోజారాణిమంగళవారం భాద్యతలు చేపట్టారు. పరిగిజూనియర్‌కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ గతంలో ఇక్కడ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహించిన విజయ్ కుమార్ నూతన ప్రిన్సిపాల్‌కు భాద్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కళాశాల నూతన ప్రిన్సిపాల్‌తో పాటు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఇరువురికి కళాశాలఅధ్యాపక బృందం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, కళాశాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కై వారికి నాణ్యమైన విద్య నందించడంతో పాటు కళాశాల సమగ్రాభివృద్ధి కై సహచర అధ్యాపక బృందంతో కల్సి అహర్నిశలు కృషి చేస్తానని ఆమె తెలిపారు. గతంలో సికింద్రబాద్ లోని వైఎంసిఏ కళాశాలలో గణిత అధ్యాపకురాలిగా విధులు నిర్వహించగా ప్రమోషన్ పై ప్రిన్సిపాల్ ఇక్కడకు వచ్చారు.

## ఉపాధి పనులపై నాలుగో విడత సామాజిక ప్రజావేదిక

**కడ్తాల్, జులై15, ప్రభాతవార్త** : కడ్తాల్ మండల కేంద్రంలో రైతు వేదికలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై నాలుగో విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి డీ ఆర్డీ వోలు శ్రీలలిత, సుభాషిణి పాల్గొన్నారు. 2024 ఏప్రిల్1 నుంచి 2025 మార్చి 31 వరకు మండలం లోనిఅన్నిగ్రామాల్లోచేపట్టినవివిధపనులపైనివేదికలను చదివి వినిపించారు. వారుమాట్లాడుతూ రిజిస్టర్లను నిర్వహణ తప్పనిసరి చేయాలని వారు అన్నారు. వనమహోత్సవంలో మొక్కలు నాటాలని వారన్నారు ఈజీఎస్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు

## పుట్టిన ఊరికి సేవ చేయడం మా అదృష్టం



**కేశంపేట జులై15 ప్రభాతవార్త** : జన్మనిచ్చిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పుట్టి పెరిగిన గ్రామానికి తమ వంతు సహాయం చేయడం మా అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు అల్వాల గ్రామం మాజీ సర్పంచ్ గులాం తాహీర్ పటేల్ కుమారులు షకీల్ పటేల్, సమీర్ పటేల్, అల్తాఫ్ పటేల్, సోమవారం కేశంపేట మండల పరిధిలోని అల్వాల గ్రామంలో ఐదు ముఖ్య కూడలిలో ఐమాక్స్ లైట్లు తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేయించారు, మరియు గ్రామస్తులు వ్యవసాయ అధికారుల కోరిక మేరకు గ్రామంలోని గల రైతు వేదికకు ప్రధాన ద్వారము పాడవడంతో దానిని తొలగించి కొత్త డోర్ ఏర్పాటు చేయించడం జరిగింది, గ్రామ అభివృద్ధి పట్ల నిబద్ధతతో ముందుకొచ్చిన అల్వాల మాజీ సర్పంచ్ గులాం ఫరూక్ గారి కుమారులు ముస్తఫ్ పటేల్, సమీర్ పటేల్, మరియు అశ్వాక్ పటేల్ లు తాము పుట్టి పెరిగిన గ్రామానికి సేవ చేస్తున్న విధానాన్ని గ్రామస్తులు అభినందించారు, రైతు వేదిక నూతన డోర్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేసినందుకు , సామాజిక బాధ్యతతో రైతుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని డోర్ ఏర్పాటు చేయడంపై వ్యవసాయ శాఖ తరపున గ్రామస్థాయి అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు పటేల్ సోదరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధిలో ప్రజలు సైతం భాగస్వాములవుతుండటం ఎంతో గొప్ప విషయమని అన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

**ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ**
**వికారాబాద్, జులై15, ప్రభాతవార్త :**
ఎన్నికల సమయంలో వికలాంగులకు, ఇతర పింఛన్‌దారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా హాజరై ప్రసంగించారు. వికలాంగుల పెన్షన్ 6 వేలు, వృద్ధులు వితంతువుల పెన్షన్ 4 వేలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కండరాల బలహీనతతో బాధపడుతున్న వారికి 15 వేలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న హైదరాబాద్ నగరంలో జరగబోయే మహాధర్నా ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకంటే ముందు వికలాంగుల పెన్షన్‌ను 6 వేలు పెంచుతామని, వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు కల్లుగీత కార్మికుల పెన్షన్ 2000 నుండి 4000 పెంచుతామని, కండరాలతో బాధపడుతున్న వారికి 15 వేల పెన్షన్ ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక 20 నెలలు గడిచిన బడ్జెట్ లేదని, నిధులు లేవని, సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారని ఎద్దేవ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎవరికి అవసరం లేని అందాల పోటీ నిర్వహించడానికి నిధులు ఉంటాయి!, వగైరా కార్యక్రమాలకు నిధులు ఉంటాయి కానీ... చేయిత పెన్షన్ దారులకు పెన్షన్ పెంచకుండా మూడు నాలుగు సంవత్సరాల నుండి భర్తలు చనిపోయిన వితంతువులకు వృద్ధులకు కొత్త పెన్షన్ ఇవ్వకుండా ఇంక ఎ దాటవేస్తుందని విమర్శించారు.

దాదాపుగా వారికి ఇవ్వాల్సిన 20వేల కోట్ల రూపాయలు విలువ చేసే పెన్షన్ల ఎ ఇవ్వకుండా తప్పించుకొని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్న సందర్భంగా ఖచ్చితంగా వారందరినీ కూడగట్టుకొని ఆగస్టు 13న లక్షలాది మందితో మహా ధర్నా ప్రదర్శన ఎ నిర్వహించి ప్రభుత్వ మెడలు వంచి అర్హులందరికీ పెన్షన్ సాధించి పెడతామని మందకృష్ణ మాదిగ అన్నారు. గతంలో బియ్యం పథకం కోసం నాలుగు కిలోల నుండి ప్రతి మనిషికి ఆరు కిలోలు వచ్చే విధంగా ఉద్యమించిన ఘనత ఎమ్మార్పీఎస్ దేనని, గతంలో వృద్ధులు వితంతువులు వికలాంగుల పెన్షన్స్ ఉద్యమించి పెంచినవే అని గుర్తు చేస్తూ ఖచ్చితంగా చేయూత పెన్షన్ల పెంపుదల కొత్త పెన్షన్లు మూడు సంవత్సరాలు నుంచి పెండింగ్ ఉన్న వాటిని సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు పి.ఆనంద్ మాదిగ, జిల్లా ఇన్చార్జి ప్రశాంత్ మాదిగ, వీహెచ్‌పీఎస్ జిల్లాఅధ్యక్షులు శ్యాంప్రసాద్, చేయూత పెన్షన్ల జిల్లా కమిటీ అధ్యక్షురాలు మంజుల, మహిళా నాయకురాలు పద్మమ్మ, పుష్ప, సునీత, ఎంఎస్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ పాల్గొన్నారు.

# రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించేదెప్పుడు..?



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పాలమాకుల జంగయ్య

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జులై15** : పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు ఎప్పుడు నిర్మిస్తారో సమాధానం చెప్పాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిపాలమాకులజంగయ్య ప్రశ్నించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్ సలీం ఫంక్షన్ హాల్‌లో బంగారు చంద్రయ్య ప్రాంగణంలో మండల మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జూరాల బ్యాక్ వాటర్ తీసుకొని 73 73 కిలోమీటర్ల మేర రూ.9 వేల కోట్లతో నిర్మిస్తే 12 మండలాలు సాగుబాటు అవుతాయని రిటైర్డ్ ఇంజనీరింగ్ ఫోరం రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో నివేదికనిచ్చిందని, కానీ దానికి రాజశేఖర్‌రెడ్డిప్రభుత్వం నిధులు కేటాయించలేకపోయిందని, కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.10 కోట్లను సర్వే పనుల నిమిత్తం కేటాయించారని, అయినా సర్వే పనులు చేయించలేదన్నారు. తెలంగాణ వచ్చాక నేను నిర్మిస్తానని ఉమ్మడి కొందర్గు మండల కేంద్రంలో హామీ ఇచ్చిన కేసీఆర్ తెలంగాణ వచ్చిన పదేళ్ల కాలంలో దాని డిజైన్ మార్చి శ్రీశైలం బ్యాక్ వాటర్‌తో నిర్మిస్తానని ప్రగల్భాలు పలికి, కరివేనా, ఉదంపూర్, లోకిరేవు వంటి చిన్న చిన్న ప్రాజెక్టులు అంతంత మాత్రంగా నిర్మిస్తూతీరాలక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు కనీసం పునాది కూడా వేయలేకపోయిందని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌పార్టీ పలుమార్లు లక్ష్మీదేవిపల్లి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథక స్థల పరిశీలన వంటివి చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ ఊసేలేదని, ఇదెక్కడిన్యాయమని విమర్శించారు.

వెంటనే ఎత్తిపోతల పథకాన్ని చేపట్టకపోతే సీపీఐ పార్టీ తరుపున పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మహాసభలో 21 మంది నూతన కౌన్సిల్, మండల కార్యదర్శిగా జిల్లేడ్ వెంకటేష్, మండల సహాయ కార్యదర్శులుగా కాలపురం బాలరాజ్, ఎండి షబ్బీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిట్టె మాణిక్యరావు, ఎం.అనిత, సి. యాదయ్య, వి.భీమయ్య, పి.పద్మ, లక్ష్మీ, రాములు, లింగమయ్య, రామకృష్ణ, గోపాల్, వీరేశం, మల్లయ్య, కార్యకర్తలుపాల్గొన్నారు

## ఘనంగా పోచమ్మ బోనాలు

**పూడూరు, జులై 15, ప్రభాతవార్త** : పూడూరు గ్రామంలో మంగళవారం పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందకు ఉదయం నుండి భారులు తీరారు. అమ్మవారికి ఇష్టమైన పిండిపదార్థాలతో తయారు చేసిన వంటకాలను, బోనంలో ఉంచి బ్యాండు మేళాలు, డప్పు చప్పుళ్లు, ఒగ్గు కళాకారుల ఆట, పాటల మధ్య అగుగడుగునా దండకాలు వేస్తూ బోనాలను ఎత్తుకొని వెళ్లి భక్తులు నైవేద్యాలను సమర్పించారు. ఈసందర్భంగాపోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు భక్తులను ఆలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత షీటీం లక్ష్యం



**షాబాద్, జులై 15, ప్రభాతవార్త:**
మహిళల భద్రతకు షీటీం ఎప్పుడు రక్షణగా ఉంటుందని షీటీం ఎస్ఐ శ్యాంసుందర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామ సమీపంలో మంగళవారం కూలీలకు షీటీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

మహిళల భద్రతకోసం ప్రభుత్వం షీటీంను ఏర్పాటుచేసిందని, మహిళలపట్ల వేదింపులు. దాడులనుఅరికట్టేందుకు పనిచేస్తున్నట్లు తెలిపారు. మహిళల పట్ల ఎవరైన అసభ్యకరంగా ప్రవర్తిస్తే 100కు ఫోన్ చేయాలని సూచించారు. బాల్యవివాహలు, మహిళల భద్రత, మహిళల చట్టాలపై కూలీలకుకుప్తంగావివరించారు, కానిస్టేబుల్స్ రవీందర్, మల్లేష్, ఎ పాల్గొన్నారు.



కేపీతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## కేపీపైదాడిని ఖండించిన కాంగ్రెస్ నాయకులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జులై15 :**
షాద్‌నగర్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కేపీ వాహనంపై జరిగిన దాడిని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఖండించారు. మంగళవారం కాంగ్రెస్‌నాయకులురైతు కాలనీలోగలకేపి ఇంటికివెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ మాట్లాడుతూ జర్నలిస్టుగానే కాకుండా సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తున్న కేపీ వాహనంపై కొందరు దుండగులు దాడికి పాల్పడడం దారుణమన్నారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల మమాన్యూస్ ఛానల్ సంస్థపై దాడి, క్యూ న్యూస్ సంస్థపై దాడి, ఇప్పుడు కేపీ వాహనంపై దాడులు ఇలాంటి చర్యల ద్వారా ప్రజాస్వామ్య విలువలను దిగజారుస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం గిరిజన, ఆదివాసీ కోఆర్డినేటర్ పిరఘు పాత్రికేయులపై ఎవరు దాడులకు పాల్పడిన ప్రతిదాడులు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం మాట్లాడుతూ జర్నలిస్టు కేపీపై దాడి చేసేందుకే కుట్ర జరిగినట్లు అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కేపీని కలిసిన వారిలో యువజన కాంగ్రెస్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందెమోహన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, సోలీపూర్ రాజేష్, కుమార్ గౌడ్, సయ్యద్ ఖదీర్, మార్గం రాజేష్, ఉన్నారు.

# మీడియాపై దాడులు మంచి సంస్కృతి కాదు

## మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



కేపీతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (జులై15) :**
మీడియాపై దాడులు మంచి సంస్కృతి కాదని, ప్రజాస్వామ్య విలువలను దిగజార్చడం సరైనది కాదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. జర్నలిస్టు కేపీ వాహనంపై దాడి జరిగిన నేపథ్యంలో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఏబీఎన్, మహాటీవీ, హెచ్‌ఎంటీవీ, క్యూ న్యూస్ తీన్మార్ మల్లన్న కార్యాలయంపైన కూడా దాడులు జరిగాయని, ప్రస్తుతం కేపీ వాహనంపై దాడి జరగడం దురదృష్టకరమన్నారు.

ధైర్యం ఉంటే ముందుకు వచ్చి ఎదుర్కోవాలే గానీ వాహనాలను, వస్తువులను ధ్వంసం చేయడం పిరికిపంద చర్య అని అన్నారు. పోలీసులు కేవలం వినాయక చవితి, రంజాన్ వంటి సందర్భాల్లో వచ్చి శాంతి సమావేశాలు ఏర్పాటు చేసి చేయి దులుపుకోకుండా తరచూ జనాలలో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేయాలన్నారు. నేరాలను నిరోధించేందుకు కేవలం సీసీ కెమెరాలపై మాత్రమే ఆధారపడడం సరికాదన్నారు. పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని మీడియాకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాదేపల్లి సిద్ధార్థ, ఎజాజ్ (అడ్డు), జాంగారి రవి, ఖాదర్‌గోరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా జోలికి వస్తే ఖబడ్దార్ – షాద్‌నగర్ జర్నలిస్టుల హెచ్చరిక

పాత్రికేయ వృత్తిలో తమకు అండగా ఉండి నాయకుడిగా ముందుకు నడిపించే జర్నలిస్టు కేపీపై దాడులకు పాల్పడితే సహించేది లేదని షాద్‌నగర్ జర్నలిస్టులు హెచ్చరించారు. సీనియర్ జర్నలిస్టులు లట్టుపల్లి మోహన్ రెడ్డి, టంగుటూరి సంజయ్ కుమార్, కస్తూరి రంగనాథ్, మారం చంద్రశేఖరన, సాయినాథ్ రెడ్డి, రాకేష్, కృష్ణ, భైరమోని మహేష్, అరుణ్ కుమార్, దర్శనం శంకర్, సురేందర్, ప్రవీణ్ యాదవ్, తదితరులు కేపీని పరామర్శించారు.

అదేవిధంగా కేపీ వాహనంపై జరిగిన దాడిని కృష్ణ, మహేష్ ప్రజాసేన రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. ఖాదర్ గోరి, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కట్ట వెంకటేష్ గౌడ్‌లు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. దాడిని పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

## జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా టి.వసంత



ప్రిన్సిపల్‌కు సన్మానం చేస్తున్న కళాశాల అధ్యాపకులు

**దౌల్తాబాద్, జులై 15, ప్రభాతవార్త:**
వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా టి.వసంత మంగళవారంరోజు బాధ్యతలు స్వీకరించింది. ఈ సంధర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ..నేను కూడా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే చదివి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఏపిపిఎస్సీ 2004లో ప్రభుత్వ జూనియర్ కళాశాల బాటని లెక్చరర్‌గా ఉద్యోగం సాధించడం జరిగిందని, గత 2 దశాబ్దాలుగా వివిధ కళాశాలల్లో లెక్చరర్‌గా బాధ్యతలు నిర్వహించి, ప్రమోషన్‌లో భాగంగా దౌల్తాబాద్ కళాశాలకు ప్రిన్సిపల్‌గా రావడం జరిగిందన్నారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థులకు అవసరమయ్యే అన్ని వసతులను కల్పించడానికి తాను సిద్దంగా ఉన్నానని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతిరోజు కాలేజీకి వచ్చి, బాగా చదివి ఉన్నత ఫలితాలు సాధించాలన్నారు. ఈ కళాశాలలో ఉన్న 12 మంది అధ్యాపకులు ప్రతిరోజు సమయానికి కాలేజీకి వచ్చి, క్లాసులు సమర్థవంతంగా నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటుగా, ఆటపాటల్లో కూడా శిక్షణ ఇవ్వాలన్నారు. అధ్యాపకులు, స్థానికుల సహకారంతో ఇప్పటికే ఈ కాళాశాలలో 10 మంది విద్యార్థులు మెదటి సంవత్సరంలో అడ్మిషన్ తీసుకున్నారని. ఇంకా అడ్మిషన్లు పెరిగే విధంగా, స్థానిక ఉపాధ్యాయులు, నాయకులు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ పాఠశాల ప్రదానోపాధ్యాయులు శ్రీహరిరెడ్డి, ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ సాయిలు, స్థానిక నాయకులు వీరన్న, రిటైర్డ్ హెడ్మాస్టర్ ప్రభాకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సేవా దృక్పథంతో ముందుకు.. స్టేషనరీ పంపిణీకి ముందడుగు



**కొత్తూరు, ప్రభాతవార్త, జులై15 :** పాఠశాల విద్యార్థుల పట్ల మానవతా దృక్పథాన్ని చాటుకుంటూ కాంగ్రెస్ యువనేత పాషం కృష్ణ తన సహృదయతను చాటుకున్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాశం కృష్ణ తన సొంత ఖర్చులతో నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, స్కేలు, ఎరేజర్లు, ఇతరత్రా స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జె.సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడేందుకు ఇదొక ప్రేరణ కలిగించే చర్య అని, సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమంలో భాగమవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులుపాశం కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బండారి భరత్ గౌడ్, సిహెచ్ సురేష్, దోలి శ్రీనివాస్, అనుపురం రమేష్, ఇరికిచ్చ జగన్, పాశం అరుణ్, కూన శివకుమార్ గౌడ్, కోటేశ్వర్ గౌడ్, బెస్త మహేష్, పాశం మహేష్, పాశం ఆంజనేయులు, పాశం రమేష్, పొన్నాడ శివశంకర్ గౌడ్, మంగ సురేష్, వడ్డె రమేష్, కటిక రమేష్, అనుపురం తేజ, పసులాది రాజు, పసులాది సునీత, బెజ్జంకి శారదమ్మ, సతీష్, మొగిలిగిద్ద నరసింహ్మా, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి వాలీ బాల్ పోటీలు

### ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి



**తాండూరు, జులై 15, ప్రభాతవార్త:** తాండూరులో గతంలో నిర్వహించిన విధంగా అందరి సహకారంతో అన్ని రాష్ట్రాల నుండి క్రీడాకారులను ఆహ్వానించి పెద్ద ఎత్తున జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించేందకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. తాండూరు మండలం జినగుర్తి గ్రామానికి చెందిన పి.రాములు కుమారుడు శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం శ్రీనివాస్ వర్దంతి ఆయన జ్ఞాపకార్థం గ్రామంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వహించిన విధంగా అందరి సహకారంతో అన్ని రాష్ట్రాల నుండి క్రీడాకారులను ఆహ్వానించి పెద్ద ఎత్తున జాతీయ స్థాయి వాలిబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. తన సోదరుడు దివంగత నేత రాజేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం ప్రతి ఏటా జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తూ యువతను ప్రోత్సహిస్తున్నట్లు గుర్తు చేశారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలు, విద్యా వికాసం కోసం శ్రమించి అందరికీ మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో తాండూరు నియోజకవర్గంలో వేలాది కోట్ల నిధులతో అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు, డాక్టర్ సంపత్‌కుమార్, ఉత్తంచంద్, గడ్డలి రవీందర్, మాజీ ఎంపిపి రాంలింగారెడ్డి, యువనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

**తాండూరు, జులై15, ప్రభాతవార్త:** : విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించడం జరిగిందని పట్టణంలోని వేదిక్ విశిష్ట పాఠశాల డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థి సంఘం హెడ్ గర్ల్స్, హెడ్ బాయ్‌ను ఎన్నుకునేందకు ఎన్నికలు నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న 4వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులకు ఓటు హక్కును కల్పించిఎన్నికలు నిర్వహించారు. ఈఎన్నికల్లో విద్యార్థులుఉత్సాహంగా పాల్గొన్నారు. డైరెక్టర్‌మహిపాల్‌రెడ్డిమాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే నాయకత్వ లక్షణాలనుపెంపొందించుకోవాలనేఉద్దేశంతోవిద్యార్థులకుఎన్నికలు నిర్వహించడం జరిగిందనితెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిట్ విచారణకు హజరైన ధారాసింగ్

**తాండూరు, జులై 15, ప్రభాతవార్త:** : రాష్ట్ర రాజకీయల్లో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ విషయంలో తాండూరుకు చెందిన కాంగ్రెస్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ మంగళవారం సిట్ విచారణకు హజరయ్యారు. గత ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పలువురు ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో తాండూరుకు చెందిన పలువురు నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయడం జరిగిందని గుర్తించిన అధికారులు విచారణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా తాండూరుకు చెందిన కాంగ్రెస్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ మంగళవారం సిట్ విచారణకు హజరయ్యారు.

## జర్నలిస్టులపై దాడులు సహించేది లేదు

**తలకొండపల్లి జులై15 ,ప్రభాతవార్త:** ప్రస్తుతం రాష్ట్రంలో జర్నలిస్టులపై కొంతమంది దాడులు చేస్తున్నారని వారిని సహించేది లేదని (టిడబ్ల్యూజేఎఫ్) తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆమనగల్ బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్నగర్ వార్త దినపత్రిక ఇంచార్జ్ కాజా పాషా వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, నిజాన్ని నిర్భయంగా రాసే జర్నలిస్టులపై కొంతమంది కావాలనే దాడులు చేస్తున్నారని వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఏలాంటి వేతనాలు లేకుండా సమాజం హితం కొరకు పనిచేస్తున్న జర్నలిస్టులపైనే దాడులు చేయడం అవివేకమని, భవిష్యత్తులో జర్నలిస్టులపై ఎలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.